
www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 13 నవంబర్ 2022

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు







మోడీ రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ గాంధీ బొమ్మ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్షాల నాయకులు

ప్రశ్నించే గొంతు కావాలి..!

- రైతులకు ధాన్యం డబ్బులు రావు
- ప్రభుత్వ సొమ్ము కోట్లు మింగినా ప్రశ్నించరు
- అక్రమ లేవుట్ల జోలికి వెళ్లరు
- పేదలకు ఇళ్ల పంపణీ చేయకపోయినా పర్వాలేదు
- ఇది మన ప్రజా ప్రతినిధుల తీరు


ప్రజలు పడే ఇబ్బందులను ప్రశ్నించాలి.? అక్రమాలు జరిగితే నిలదీయాలి? ప్రజల కష్టాలను తీర్చాలి? ప్రభుత్వం నుంచి ప్రజలకు అందాల్సిన నిధులు రాబట్టాలి? రైతులు ఆరుగాలం పండించిన పంటకు గిట్టు బాటు ధర వచ్చేలా చూడాలి? ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల కోసం నిలదీయాలి? ఇవి మనం ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు ప్రజల కోసం చేయాల్సిన పనులు. ఇప్పటి వరకు ఎవరికీ ఇవ్వని మెజార్టీతో వైసిపి ప్రభుత్వాన్ని జిల్లా ప్రజలు ఎన్నుకున్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఒక్క ప్రజా ప్రతినిధి ప్రశ్నించడం లేదు. మన కోసం ఎవరు మాట్లాడుతారా? అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఇవన్నీ వదిలేసి, ప్రజా ప్రతినిధులు చేస్తున్న చిత్ర విచిత్రాలు చూసి జనం నవ్వుకుంటున్నారు.



అక్రమ లేవుట్లు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మన కోసం ప్రశ్నించి, మాట్లాడి, తమ బాధలు తీర్చుతారని భావించి అధికారం కట్టబెట్టిన వైసిపి ప్రజల ఇబ్బందులు పట్టించు కోవడం లేదు. కనీసం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం ఒక్కరు ప్రయత్నం చేయడం లేదు. ప్రభుత్వం తమదే కనుక ప్రశ్నించడం లేదు. జిల్లా వ్యాపితంగా వేలాది మంది సొంత ఇళ్లకోసం ఎదురుచూస్తున్నారు. 2012 నుంచే పేదలకు వ్యక్తిగత ఇళ్లు మంజూరు చేయడం లేదు. 2009 వైసిపి ప్రభుత్వంలో కొంత ఇళ్ల నిర్మాణం జరిగినా 2014 వరకు బిల్లులు చెల్లించలేదు. టిడిపి అధికారంలోకి వచ్చాక వ్యక్తిగత ఇళ్ల నిర్మాణం మానేసి అపార్ట్‌మెంట్ నిర్మాణం చేశారు. జిల్లా వ్యాపితంగా 70 వేల ఇళు మంజూరు చేశారు. అందులో 46 వేల ఇళ్ల వరకు నిర్మించారు. అందుకోసం ప్రజల నుంచి సుమారు రూ.100 కోట్లు సబ్సిడీ బ్యాంకుల్లో డిపాజిట్ చేయించారు. నెల్లూరు వెంకటేశ్వరపురం, అల్లీపురం, ఆత్మకూరు, కావలి, నాయుడుపేట, వెంకటగిరి, గూడూరు ప్రాంతాల్లో భారీగా ఇళ్ల నిర్మాణం చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చి మూడున్నరేళు గడిచినా ఒక్కరికీ ఇళ్లు పంపిణీ చేయలేదు. ప్రభుత్వానికి చెల్లించిన నగదుకు వడ్డీలు చెల్లించుకుంటున్నారు. జిల్లాలోని ఒక్క ఎంపి, ఎంఎల్‌సి, ఎంఎల్ఎలు ప్రశ్నించడం లేదు. తమ కష్టాలు ఎవరు ప్రశ్నిస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. మధ్యతరగతి, సాధారణ ప్రజలు రియల్ ఏస్టేట్ యజమానులను నమ్ముకొని సొంతింటి కల తీర్చుకోవాలని ప్రయత్నాలు చేశారు. జిల్లాలో ఇటీవల కాలంలో నుడా పరిధిలో పెద్ద ఎత్తున రియల్ ఏస్టేట్ సాగింది. దీనిని అందరూ ఎంఎల్ఎలు ముందుండి నడిపించారు. ఇందులో విచిత్రమే మిటంటే సుమారు 118 లే అవుట్స్‌కు అనుమతుల్లేవు అక్రమంగా నిర్మించారు. ప్రజలకు అమ్మకాలు చేశారు. నుడా పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ అక్రమాలు జరిగాయి. అధి కారులు అక్రమాల గుర్తించినా చర్యలు తీసుకోలేక పోతున్నారు. తెలిసినా ప్రజా ప్రతినిధులు నోరెత్తడం లేదు. ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. ఈ వ్యవహారంలో కోట్లాది రూపాయలు చేతులు మారాయని ప్రచారం సాగుతోంది. కలెక్టర్ చర్యలకు ఉపక్రమిస్తున్నా అధికారపార్టీకి చెందిన కొందరు నేతలు, ప్రజా ప్రతినిధులు అడ్డుపడుతున్నారని తెలుస్తోంది. ప్రజల డబ్బును తలా కాస్త పంచుకుతిన్నారనే విమర్శలున్నాయి. ఇంత జరుగుతున్నా జిల్లాలోకి ఒక్క ప్రజా ప్రతినిధి ప్రశ్నించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. గతేడాది జిల్లా రైతాంగం అనేక ఇబ్బందులు పడి వ్యవసాయం చేశారు. భారీగా దిగబడి వచ్చింది. ఇందులో సివిల్ సప్లయ్ అధికారులు 3.60 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేశారు.ఏడాది గడిచినా ఇంకా అనేక మంది రైతులకు బకాయిలున్నాయి. రైతులు నేరుగా వచ్చి కలెక్టర్‌ను కలిసి తమ గోడు వెళ్లబుచ్చుకుంటున్నారు. కనీసం పిల్లలను చదివిం చుకులేకపోతున్నాం,. తిండికి ఇబ్బందులున్నాయని ఇటీవల ఉలవపాడు రైతులు కలెక్టర్ ముందు గోడు వెళ్లబుచ్చారు. ఇంత జరుగుతున్నా మన ప్రజా ప్రతినిధులు ఎక్కడా కనిపిచండం లేదు. కనీసం రైతుల తరపున మాట్లాడే నాధుడే తారసపడడం లేదు. ఇటీవల డిఎం సివిల్ సప్లయ్ కార్యాలయంలో భారీ కుంభకోణం జరిగింది. జిల్లాలో డ్వాక్రా మహిళలు, రైతులు, ట్రాన్స్ పోర్టర్లు ఇలా ఎందరో నిరుపేదలకు అందాల్సిన నగదును అధికారులు, ఉద్యోగులు, ప్రయివేటు వ్యక్తులు పంపకాలు వేసుకున్నారు. దీనిని ఒక్కరు ప్రశ్నించడం లేదు. ఎక్కడో చిన్న చిన్న విషయాలను పట్టుకొని గగ్గోలు పెడుతున్నారు. ఇవే కాదు. ఎపి జెన్కోను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంటే అక్కడ కార్మికులు 300రోజుల నుంచి పోరాటం చేస్తున్నారు. ఇది తప్పు ముఖ్యమంత్రికి చెప్పే ధైర్యమున్న ఒక్క ప్రజాప్రతినిధి, నేతల కనిపించడం లేదు. ఈ పరిణామాలను జిల్లా ప్రజలు జీర్ణించు కోలేకపోతున్నారు. ఇంత జరుగుతున్నా "మన ఎంపి, ఎంఎల్‌సి, ఎంఎల్ఎలు ఒక్కరు మాట్లాడడం లేదు" అని కేఫ్‌ల వద్ద, పది మంది కూర్చున్న వద్ద చర్చించుకుంటున్నారు. 2019 ఎన్నికల్లో ప్రతి పక్షాలకు ఒక్క సీటు ఇవ్వకుండా అంతా వైసిపి నేతలకు కట్టబెట్టారు. ఇద్దరు ఎంపిలు, 10 మంది ఎంఎల్ఎలు, జెడ్‌పి ఛైర్మన్, మేయర్, మున్సిపల్ ఛైర్మన్లు, ఎంపిపిలు, జెడ్‌పిటిసి, అత్యధిక మంది సర్పంచ్‌లు, అందరూ వాళ్లే ప్రశ్నించే ప్రజా ప్రతినిధి ఒక్కరంటే ఒక్కరూ కనిపించడం లేదు.



ప్రజలకు పంపిణీ చేయకుండా నిలిచిన ఇళ్లు



ధాన్యం నగదు కోసం ఉలవపాడు రైతులు నిరసన

మోడీ గో బ్యాక్..!

వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-నెల్లూరు

ఎన్నికల సమయంలో ప్రజలకు చేసిన హామీలు, విభజన హామీలు, ప్రత్యేక హోదా వంటివి నెరవేర్చకుండా ప్రధాని నరేంద్రమోడి రాష్ట్ర పర్యటనకు రావడం సిగ్గుచేటని వామపక్ష పార్టీల నేతలు విమర్శించారు. హామీలను విస్మరించి రాష్ట్ర పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ గో బ్యాక్ అంటూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం నగరంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. సిపిఎం, సిపిఐ, ఇతర వామ పక్షాలు, పలు వ్యవసాయ, రైతు, కౌలు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు. విభజన హామీలు నెరవేర్చకుండా ప్రధాని మోడి ఆంధ్రప్రదేశ్ పర్యటనకు రావడం సిగ్గుచేటని సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య విమర్శించారు. రాష్ట్ర సమస్యలను ప్రస్థావించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విఫలం చెందారన్నారు. విశాఖకు రైల్వే జోన్, అమరావతి రాజధాని నిర్మాణానికి, రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి నిధులు ఇస్తానని నమ్మబలికి మోసం చేశారన్నారు. విభజన హామీలు అమలు చేయకుండా, ప్రత్యేక హోదా ఇవ్వకుండా ప్రధాని మోడీ రాష్ట్ర పర్యటనకు రావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రాష్ట్ర పర్యటన చేస్తున్న ప్రధాని మోడిని అధికార పార్టీ ఆహ్వానించడం క్షమించరాని నేరమన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని చేసే పోరాటంలో టిడిపి, జనసేనలు భాగస్వాములు కావాలన్నారు. సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ ఎపికి పదేళ్లపాటు ప్రత్యేక హోదా ప్రకటిస్తామని 2014లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన మోడీ ఎనిమిదేళ్లయినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇచ్చిన మాటలు, చేసిన హామీలు అమలు చేసి అప్పుడు రాష్ట్ర పర్యటనకు ప్రధాని రావాలన్నారు. ఈ నిరసనలో సిపిఎం నాయకులు జి. నాగేశ్వరరావు, కటికాల వెంకటేశ్వర్లు, పులిగండ్ల శ్రీరాములు, సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య, కిన్నెర కుమార్ , పి.సూర్యనారాయణ, ఆర్ శ్రీనివాసులు, చంద్రారెడ్డి, డివైఎఫ్ఐ , ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ కుంభకోణంలో

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి



గాంధీబొమ్మ సెంటర్‌లో నినాదాలు చేస్తున్న రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి- నెల్లూరు :నెల్లూరు జిల్లా పౌర సరఫరాల విభాగంలో చోటు చేసుకున్న అవినీతి కుంభకోణంపై ప్రభుత్వం సమగ్ర విచారణ నిర్వహించి అసలు నింధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతు సంఘం, ఎపి వ్యవసాయకార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో ఈ మూడు సంఘాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలె వెంగయ్య మాట్లాడుతూ సివిల్ సప్లయ్ విభాగంలో అనేక రకాలుగా అవినీతి చోటు చేసుకుందన్నారు. రూ.40 కోట్ల మేరకు నగదు దుర్వినియోగమైందని ప్రభుత్వమే ప్రకటించినప్పటికీ దాదాపుగా రూ.100 కోట్ల మేరకు అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. ఈ వ్యవహారానికి కారణమైన ఉద్యోగులపై, అధికారులపై ప్రభుత్వం నామమాత్రపు చర్యలు తీసుకుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అవినీతి వ్యవహారంలో పాత్రదారుల నుంచి నగదు రికవరీ చేసి రైతుల బకాయిలను పూర్తిగా చెల్లించాలన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పులిగండ్ల శ్రీరాములు మాట్లాడుతూ జిల్లాలో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అమ్ముకునేందుకు నానా అవస్థలు పడుతు న్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ రైతులు పండించిన ధాన్యం నుంచి 5వ వంతు కొనుగోలు చేయలేదన్నారు. అష్ట కష్టాలు పడి రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే అధికారులు, మిల్లర్లు నానా అవస్థలకు గురిచేస్తున్నారన్నారు.తూకాల్లో, రేటులో మోసం,మొత్తమ్మీద రైతులు పుట్టి ధాన్యంపై దాదాపుగా రూ.3 వేలు నష్టానికి విక్రయించే పరిస్థితి ఏర్పడిందన్నారు. పౌరసరఫరాల విభాగంలో గడిచిన ఆరేళ్ల కాలంలో దాదాపుగా రూ.150 కోట్ల మేర అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. నిదులు దుర్వి నియోగమయ్యాయని అధికారులే ప్రకటించారన్నారు. కొంత మంది అవినీతి అధికారులు రైతుల నోరు కొట్టి ఆధనాన్ని అంతా వారు తిన్నారన్నారు. ప్రస్తుతం విచారణ చేస్తున్న ఎసిబి అధికారులు పూర్తి స్థాయిలో 2016 నుంచి సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికై రైతాంగానికి రూ.10 కోట్ల రూపాయల బకాయి ఉందన్నారు. మహిళా మండలి కమీషన్‌కు రూ.7 కోట్ల వరకు బకాయి ఉందన్నారు.హమాలీలకు బకాయి ఉందని, ప్రస్తుతం అధికారులు ప్రకటించిన అవినీతి నగదు రూ.40 కోట్ల రైతులకు చెందాల్సిందేనన్నారు. కార్యక్రమంలో వ్య.కా.స. జిల్లా కార్యదర్శి ఎం.పుల్లయ్య, ఆలూరి తిరుపాలు, నాయకులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితమే మత్స్యకారేతర ప్యాకేజీ



మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి- ముత్తుకూరు :కేరళ తరహాలో కార్మిక చట్టాలు అమలు పరచాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సిఐటియు నాలుగో మండల మహాసభ శనివారం ముత్తుకూరు శ్రామిక భవన్ లో జరిగింది. ఈ సందర్భంగా, ఆటో కార్మిక సంఘం(సిఐటియు) జిల్లా అధ్యక్షుడు రాజా మాట్లాడుతూ కార్మికుల భవిష్యత్‌ను దష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలు చట్టాలు చేయాలన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుం బాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.అనంతరం సిఐటియు కష్ణపట్నం క్లస్టర్ కార్యదర్శి గోగుల శ్రీనివాసులు మాట్లాడుతూ పోరాటాల ఫలితంగానే మత్స్యకారే తర ప్యాకేజీ వచ్చిందన్నారు.క్లస్టర్ సిఐటియు అధ్యక్షుడు గడ్డం అంకయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, ఉపాధి కూలీలకు సిఐటియు అండగా పోరాడుతుందన్నారు. సిఐటియు, సిపిఎం నేతలు పాల్గొన్నారు.

కొనసాగిన చిరు జల్లులు

తోటపల్లిగూడూరు : బంగాళా ఖాతంలో నెలకొన్న అల్పపీడనం ప్రభావంతో మండలంలో ఎడతెరపిలేకుండా వర్షం పడుతోంది. మండలం లోని మల్లికార్జునపురం, వెంకన్నపాలెం, విలుకానిపల్లి, కోడూరు తదితర పంచాయతీల్లో గిరిజనులు, చల్లా యానాదుల కుటుంబాలు అధిక సంఖ్యలో ఉన్నారు. వీరంతా వర్షం కారణంగా కూలి పనుల లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా కోడూరు తీరంలో అలల ఉధృతి కొనసాగుతోంది.

21న కార్తీక వన భోజనాలు



కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -కందుకూరు : ఉమ్మడి ప్రకాశం జిల్లా నాయి బ్రాహ్మణల ఆధ్వర్యంలో ఈ నెల21న ఒంగోలులోని శ్రీగిరి కొండమీద సుబ్రహ్మణ్య స్వామి గుడి ఆవరణంలో కార్తిక వనభోజనాలు జరగనున్నాయి. ఈ మేరకు శనివారం ఇక్కడ కరపత్రం ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయి బ్రాహ్మణ ఐక్యవేదిక అధ్యక్షులు పిల్లోట్ల సుధాకర్, నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి కోటేశ్వరరావు, నాయి బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక కన్వీనర్ నాదెండ్ల రాఘవ, ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి మధు బాబు పాల్గొన్నారు.

కుంటలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -కందుకూరు : ప్రమాదవశాత్తు కుంటలో పడి ఓ వ్యక్తి మతి చెందిన సంఘటన శనివారం జరిగింది. కేసరి గుంట కాలనీకి చెందిన కుంచాల శ్రీనివాసరావు (37) చాకలికుంట లో ప్రమాదవశాత్తు జారి పడడంతో మృతిచెందారు.అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారాన్ని తెలిపారు. సమాచారం అందిన వెంటనే అగ్నిమాప క శాఖ కేంద్ర కార్యాలయం అధికారి వెంకటేశ్వర రావు ఘటనా స్థలానికి వెళ్ళారు. సిబ్బంది వాటర్ ప్రూఫ్ జాకెట్ ధరించి మృతదేహాన్ని బయటకు తెచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కక్షిదారులకు అన్నదానం



కక్షిదారులకు భోజనం వడ్డిస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి -కందుకూరు : జాతీయ లోక్ అదాలత్, కార్తీకమాసం సందర్భంగా కందుకూరు కోర్టు భవనాల ఆవరణంలో అన్నదానం నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో కందుకూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు వలేటి శ్రీధర్ నాయుడు, న్యాయవాదులు వై సాంబశివరావు, కె మల్లికార్జున రావు తదితరులు కక్షిదారులకు భోజనం వడ్డించారు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణకు

112 పోలింగ్ కేంద్రాలు : కలెక్టర్



రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చిస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 76 పోలింగ్ కేంద్రాలను, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి 36 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ కెవియన్ చక్రధర్ బాబు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ లోని ఎస్సార్ శంకరన్ హాల్లో ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని మౌలిక వసతులు ఉన్నటువంటి కళాశాలలు, పాఠశాలలను పోలింగ్ కేంద్రాలుగా ఎంపిక చేసినట్టుగా తెలిపారు. ప్రతి మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. పట్టభద్రుల ఎన్నికకు సంబంధించి ఆత్మకూరు, బుచ్చి, కొవూరు, పొదలకూరు, ఉదయగిరి, వింజమూరు, కలిగిరి మండలాలలో రెండు పోలింగ్ కేంద్రాలు, కందుకూరు - 4, కావలి - 6, నెల్లూరు అర్బన్ - 9, నెల్లూరు రూరల్ - 19 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. తుది జాబితా డిసెంబర్ 30న విడుదల చేస్తామనాన్రు. సమావేశంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున వై. మురళీధర్ రెడ్డి, టిడిపి తరపున సిహెచ్. వెంకటేశ్వర్ రెడ్డి, బిజెపి నుండి సిహెచ్ ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నుండి బాల సుధాకర్, సిపిఎం నుంచి మోహన్ రావు హాజరయ్యారు.

ఓట్ల నమోదులో అక్రమాలను అరికట్టాలి : సిపిఎం


ఎంఎల్‌సి ఎన్నికల ఓట్ల నమోదులో అక్రమాలను అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. మోహన్ రావు విజ్ఞప్తి చేశారు. శనివారం కలెక్టర్ కార్యాల యంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష రాజకీయ పార్టీల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఎల్‌సి ఎన్నికల ఓట్ల నమోదులో కార్పొరేట్ విద్యాసంస్థల యాజ మాన్యాలు అధికార పార్టీ అభ్యర్థి అక్రమంగా ఓట్లు నమోదు చేయించారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నమోదు చేసిన ఓట్లపై విచారణ చేపట్టాలని, ప్రత్యేక టీమును ఏర్పాటు చేసి వెరిఫికేషన్ చేయాలన్నారు. అక్రమ ఓట్లను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల పోలింగ్ కేంద్రాలఏర్పాటుపై పలు సూచనలు చేశారు.సిపిఎం నాయకులు టి.దయాకర్ తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

'గడపగడపకు మన ప్రభుత్వం'

కలువాయి :మండలంలోని కేశమనేనిపల్లిలో ఎంఎల్ఎ ఆనం రామ నారాయణరెడ్డి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. సచివా లయాన్ని ఆయన ప్రారంభించారు. గడపగడపకు వెళ్లి కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ పలకరించారు. జెడ్‌పిటిసి అనీల్ కుమార్ రెడ్డి, సర్పంచ్ కష్ణయ్య యాదవ్, వైసిపి అధ్యక్షులు కష్ణారెడ్డి, తహశీల్దార్ సోమ్లా నాయక్, ఎంపిడిఒ నారాయణ పాల్గొన్నారు.

బాలికపై పిఆర్‌ఒ లైంగిక వేధింపులు

దేహశుద్ధి చేసిన తల్లిదండ్రులు



లైంగిక వేధింపులకు పాల్పడ్డ పిఆర్‌ఒ బ్రహ్మయ్య

ప్రజాశక్తి-నెల్లూరు :నగరంలోని పొదలకూరు సమీపంలోని ఒవెల్ ప్రయివేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న బాలికను పాఠశాలకు చెందిన పిఆర్‌ఒ కమ్ టీచర్ బ్రహ్మయ్యనాయుడు లైంగిక వేధింపులకు గురిచేస్తున్న వైనం ఆలస్యంగా వెలుగుచూసింది. ఆ బాలికను గత కొన్ని రోజులుగా పిఆర్‌ఒ బ్రహ్మయ్య లైంగికంగా వేధిస్తున్నాడు. చివరకు ఆ పిఆర్‌ఒ కీచక చర్యలను తట్టుకొలేని బాలిక శనివారం తల్లిదండ్రుల దృష్టికి తీసుకొచ్చింది. స్పందించిన తల్లిదండ్రులు వెంటనే తమ కూతురిని వెంటబెట్టుకొని పాఠశాలకు వచ్చి అసలు విషయాన్ని పాఠశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. యాజమాన్యం నుంచి స్పందన లేకపోవడంతో లైంగిక వేధింపులకు గురి చేస్తున్న బ్రహ్మయ్య పై దాడికి యత్నించారు. విషయాన్ని పసిగట్టిన పాఠశాల యాజమాన్యం ఆ పిఆర్‌ఒను అక్కడ నుంచి పంపించి వేసింది. దీంతో బాలిక తల్లిదండ్రులు, స్థానికులు పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. ఈ దశలో బ్రహ్మయ్య బాధితుల కంట పడటంతో దేహశుద్ధి చేశారు. దీంతో బ్రహ్మయ్యను పాఠశాలలోని ఓ గదిలో పెట్టి తలుపులు వేసింది. ఈ సమాచారం తెలుసు కున్న వేదాయా పాళెం పోలీసు లు అక్కడికి చేరుకున్నారు. బాధిత తల్లి దండ్రులకు, ఆందోళన కారులకు సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. సిఐ బాధితులను ఉద్దేశించి మాట్లాడుతూ కేసు పెట్టాలని, తాను విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థిని తల్లిదండ్రులు, మరి కొంత మంది ఫిర్యాదు చేయడంతో సదరు పిఆర్‌ఒపై పోక్సో, అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.



లైంగిక వేధింపులకు పాల్పడ్డ పిఆర్‌ఒపై చర్యలు కోరుతూ ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

క్రిమినల్ కేసు నమోదు చేయాలి : ఎస్ఎఫ్ఐ

బాలికను లైంగికంగా వేధించిన బ్రహ్మయ్యపై వెంటనే క్రిమినల్ కేసులు పెట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఓవెల్ స్కూల్ ఎదుట నిరసన, ధర్నా చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి శ్రీనివాసులు మాట్లాడుతూ నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిని లైంగికంగా వేధించిన పిఆర్‌ఒ బ్రహ్మయ్యపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు హర్షవర్ధన్ ,జిల్లా కమిటీ సభ్యులు, సంతోష్, కుమార్, చిన్ని, గణేష్, మాధవ్, హేమంత్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమం

యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్



మాట్లాడుతున్న తాళ్లూరి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-నెల్లూరు :వైద్య ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ఉద్యమించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రథమ మహాసభ శనివారం ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలో ఎవి శేషయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న తాళ్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రెగ్యులర్ ఉద్యోగులకు తగ్గించిన హెచ్‌ఆర్ఎ పెంపుదలకు, డిఎ బకాయిల చెల్లింపునకు, సరెండర్ లీవ్ మొత్తం మంజూరు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ తదితర సమస్యల పరిష్కారం కోసం ంఘటితంగా ఉద్యమించాలని పిలుపు ఇచ్చినారు .జిల్లా గౌరవాధ్యక్షులు నరమాల సతీష్ కుమార్ మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసులు క్రమబద్ధీకరణ, మినిమం టైం స్కేల్ తో పాటు డిఎ ,హెచ్‌ఆర్ఎలతో కూడిన గ్రాస్ శాలరీ, సానిటరీ ,సెక్యూరిటీ, చెదలు నివారణ ఉద్యోగుల కనీస వేతనం 26 వేల రూపాయలు పెంపు దల చేసి ప్రభుత్వమే వారి ఖాతాలో నేరుగా జమ చేయడం తదితర డిమాండ్ సాధనకు ఐక్యవేదిక ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

జిల్లా గౌరవధ్యక్షులుగా నరమాల సతీష్ కుమార్, అధ్యక్షులుగా ఎవి శేషయ్య, ప్రధాన కార్యదర్శి గా షేక్. సంధాని బాషా, అసోసియేట్ అధ్యక్షులుగా కమ్మటి శ్రీనివాసులు, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్. శివప్రసాద్ ,కోశాధికారిగా షేక్ ఉస్మాన్, సహాయ కార్యదర్శిగా రాజ్ కుమార్, మధు, ఏ విజయసారథి,పి. ఆనంద్ బాబు, సిహెచ్ నరేంద్ర ,ఉపాధ్యక్షులుగా అనీష్, రావీష్,షేక్ జిలాని, ఖాజా మస్తాన్, రాజీవ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా జగదీష్, ప్రసాద్ ,రమేష్, రామంజులు ,మోహన్ రాజు, ఎన్. శైలజ, ఏ. విజయ్ కుమార్ ,బిందు, నరసింహులు, ట్రామా మల్లీ ,కమిటీ సభ్యులుగా కే శ్రీధర్ రావు, రమేష్, రొడ్డ ఇజ్రాయిల్, ఎమ్మెస్ కళ్యాణి, రీటా, వందల కామాక్షయ, శివప్రసాద్, కే. వెంకటేశ్వర్ రెడ్డి ,సామెల్, కే. లత ,వసంతమ్మ, శారద ఎన్నుకున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కలువాయి : మండలంలోని చింతలాత్మకూరు వద్ద రూ.16 లక్షలతో సోమశిల దక్షిణ కాలువ నుంచి చేపట్టనున్న సాగు నీటి లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు ఎంఎల్ఎ ఆనం రామనారాయణ రెడ్డి శంకుస్థాపన చేశారు.లిఫ్ట్ ఇరిగేషన్ పనుల శీలాఫలకానికి ఎంఎల్ఎ పూజలు చేశారు.ఎఎంల్ఎను గ్రామస్తులు సత్కరించారు. జెడ్‌పిటిసి అనీల్ కుమార్ రెడ్డి, సర్పంచ్ ప్రభావతి, ఎంపిటిసి వెంకటేశ్వర్లు, వైసిపి అధ్యక్షులు కష్ణారెడ్డి, సోమశిల ప్రాజెక్టు ఈ ఈ మల్లికార్జున పాల్గొన్నారు.

మద్యం షాపు ఏర్పాటు చేయొద్దు : ఐద్వా



ప్రజాశక్తి -కందుకూరు : పట్టణం ఆరో వార్డు సుందరయ్య నగర్ వద్ద ఏర్పాటు చేయబోతున్న మద్యం షాపుని ఎత్తివేయాలని ఐద్వా ఆధ్వర్యంలో శనివారం షాపు ఎదుట ధర్నా జరిగింది. జననివాసాల ప్రాంతాలకు దగ్గరగా మద్యం షాపు పెట్టడం సరికాదని, వెంటనే తొలగించాలని ఆ ప్రాంత ప్రజలు డిమాండ్ చేశారు. లేదంటే నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు.ఐద్వా కార్యదర్శి ఎస్‌కె మల్లికా, ఎస్‌కె అస్మా ,పద్మ ,సిఐటియు నాయకులు ఎస్ఎ గౌస్, కాలనీవాసులు పాల్గొన్నారు.

నందవరంలో 'ఫ్యామిలీ డాక్టర్'



ప్రజాశక్తి-మర్రిపాడు : గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శనివారం నందవరంలో వైద్యాధికారి డాక్టర్ కల్పన, 104డాక్టర్ వెంకటేశ్వర్లు నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు చేసి మందులను అందజేశారు. గ్రామంలో ఆరోగ్య సమస్య తలెత్తిన ఫోన్ ద్వారా సంప్రదించి తమ సమస్యను వివరించి సలహాలు సూచనలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సైదా, హెల్త్ అసిస్టెంట్ పెంచలరావు, ఎఎన్ఎం నూర్జహాన్, ఆశ నారాయణమ్మ, ప్రసన్న, పైలెట్ ఫిరోజ్ పాల్గొన్నారు.

దావూద్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని కంపసముద్రం ఉర్దూ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్.దావూద్ ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా గుంటూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, కృష్ణా జిల్లా కలెక్టర్ ఇంతియాజ్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న దావూద్ రాష్ట్రస్థాయి అవార్డు పొందడంపై ఎంఇఒ మాలకొండయ్య, మండలంలోని పలువురు ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

బాలుర పాఠశాలలో సామగ్రి వేలం



ప్రజాశక్తి-ఉదయగిరి : ఏపి గురుకుల పాఠశాల బాలుర గండిపాలెం పాఠశాలకు సంబంధించిన పాతసామగ్రిని ఏపి విద్యాలయ సంస్థ గుంటూరు ఉత్తర్వుల మేరకు మంగళవారం వేలం నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ జి.మురళీకృష్ణ తెలిపారు. పాఠశాలలో విరిగిపోయిన ఉపయోగపడని ఇనుప ట్రంకు పెట్టెలు, వంటపాత్రలు, ఇనుప మిషన్ సామాగ్రి డెస్క్ మంచాలకు వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఈ వేలంలో పాల్గొనదలచిన పోటీదారులు సంబంధిత వస్తువులకు 10శాతం ధరావతుతో 15న ఉదయం 10-30 గంటలకు చెల్లించి పోటీలో పాల్గొనాలన్నారు. వేలం పొందిన వారు వారి సొంత ఖర్చులతో సదరు వస్తువులను తీసుకు వెళ్లాలన్నారు. ఈ వేలం రద్దు చేయడానికి గానీ వాయిదా వేయడం గానీ పూర్తి అధికారం ఈ పాఠశాల ప్రిన్సిపాల్ సంబంధించిందన్నారు. నాలుగు రోజులలోపు సొంత రవాణా ఖర్చులతో పాడుకున్న వస్తు సామాగ్రి ఖాళీ చేసి ఖాళీ చేసే సమయంలో మిగతా మొత్తం చెల్లించాలన్నారు. వేలం షరతులు ఇతర విషయాలు గురించి ప్రిన్సిపల్ 9441601085 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జికి ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పురపాలక పరిధిలోని సీనియర్ సివిల్ జడ్జీగా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణారావును జిల్లా జడ్జిగా పదోన్నతి లభించింది. ఆయనను ఏలూరు జిల్లా జడ్జీగా ప్రమోషన్ ఇచ్చి బదిలీ చేశారు. ఏలూరు జిల్లా జడ్జీగా పదోన్నతిపై వెళుతున్న రామకృష్ణారావుకు ఆత్మకూరు బార్ అసోసియేషన్ సభ్యులు శనివారం ఘనంగా సత్కరించారు. ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిన్నారెడ్డి, కార్యదర్శి మాల్యాద్రి, న్యాయవాదులు మహేదరెడ్డి, వెంకటేశ్వర్లు, ఎపిపి రమణయ్య, నజీర్, నందా ఓబులేసు, మధు, హరికృష్ణ, సురేష్, అహ్మద్‌సిరాజ్, తిరుపతమ్మ,జయలక్ష్మి ఉన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పురపాలక పరిధిలోని 14వ తేదీ నుండి 21 తేదీ వరకు ఆత్మకూరు శాఖ గ్రంథాలయంలో 55 జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తామని గ్రంథాలయ ఇన్‌ఛార్జ్ ఓ.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్ తదితర పోటీలను నిర్వహించి విజేతలకు 20వ తేదీ వారోత్సవాల ముగింపు సమావేశంలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం జరుగుతుందన్నారు. ఈ వారోత్సవాల సందర్భంగా 15వ తేదీ నుండి గ్రంథాలయ ఆవరణంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రత్యేక పూజలు



ప్రజాశక్తి-ఉదయగిరి : అయ్యప్ప స్వాముల ఆశీర్వాదంను మాజీ ఎంపిపి పారిశ్రామికవేత్త చేజర్ల సుబ్బారెడ్డి శనివారం పొందారు. ఈ సందర్భంగా స్థానిక చేజర్ల సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తమ అతిథి భవనంలో అయ్యప్ప స్వాముల ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో భక్తి శ్రద్ధలతో అయ్యప్ప స్వాములు చేసే పూజల్లో వారి నుండి ఆశీర్వాదం పొందడం ఆనందదాయకంగా ఉందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వైసిపి నాయకులు ఉప్పుటూరి ఉమా, మాజీ మండల ఉపాధ్యక్షులు బాలకోటయ్య శ్రీనివాసులు, యువ నాయకులు కల్లూరి రాజారెడ్డి, తదితరులున్నారు.

మల్టీపుల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-కోవూరు : జిల్లాలోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాల గీతాంజలి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో శనివారం ఎస్ అండ్ హెచ్ విభాగం ఆధ్వర్యంలో ప్రథమ బిటెక్ విద్యార్థులకు మల్టీపుల్ ఇంటెలిజెన్స్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఏఎస్ అధికారి బి.లక్ష్మీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో మెజీషియన్ రామ్ జీ, కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి సుబ్బారావు, కళాశాల సెక్రటరీ ఎన్ సుధాకర్ రెడ్డి, కళాశాల ఎస్ అండ్ హెచ్ విభాగాధిపతి డాక్టర్ పిఎం కిషోర్, విభాగాధిపతులు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

క్రికెట్ కిట్లు అందజేత



ప్రజాశక్తి-ఉదయగిరి : యువత శారీరక దృఢత్వం మానసిక ఆరోగ్య మెరుగునకు క్రీడలు ఎంతో దోహదపడతాయని అప్పసముద్రం యువతకు చేజర్ల చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుల చేజర్ల సుబ్బారెడ్డి క్రికెట్ కిట్లు అందజేశారు. శనివారం మండల పరిధిలోని అప్పసముద్రం గ్రామపంచాయతీ అప్ప సముద్రం యువతకు తమ ఛారిటబుల్ ట్రస్ట్‌తో జెడ్‌పిటిసి మోడీ రామాంజనేయులు యువతకు క్రికెట్ కిట్లు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలతోపాటు గ్రామ అభివృద్ధికి యువత తమవంతుగా సహకారం అందించాలని కోరారు. మాజీ మండల ఉపాధ్యక్షులు బాలకోటయ్య శ్రీనివాసులు, ఉప్పుటూరు ఉమ పాల్గొన్నారు.

నాటుసారా స్థావరంపై దాడులు

ప్రజాశక్తి-ఉదయగిరి : అర్ధరాత్రి ఎస్ఇబి అధికారులు నాటుసారా తయారీ కేంద్రాలపై మెరుపు దాడులు నిర్వహించి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఎస్ఇబి అధికారులు మాట్లాడుతూ శుక్రవారం అర్ధరాత్రి కృష్ణంపల్లి బిసి కాలనీలో నాటుసారా అక్రమ రవాణాపై సమాచారంతో దాడులు నిర్వహించి సింగన బోయిన సుబ్బరాయుడును అదుపులోకి తీసుకొని 5 లీటర్ల నాటు సారాను 200 లీటర్ల నాటు సారా మూట పదార్థాలను వారి నుండి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎం.రవీంద్రబాబు, టి.కిరణ్ కుమార్, సిబ్బంది రమణయ్య, జయచంద్ర ఉన్నారు.

పోలీస్ స్టేషన్‌లో డిఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి-దగదర్తి : పోలీస్ స్టేషన్‌లో కావలి డిఎస్‌పి వెంకటరమణ శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జాతీయ రహదారిపై దగదర్తి ఎస్ఐ సుమన్ ఏర్పాటు చేసిన బారికేడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో సిఐ, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : మండలంలోని మినగల్లు గ్రామ ఎస్‌టి కాలనీలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శనివారం హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మినగల్లు గ్రామంలో కళాకారులు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ ఇండియా సూపర్‌వైజర్ ఎస్.కెజియా, ఏఎన్ఎం జి.వనజ, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసులురెడ్డి, వైద్యసిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపునకు తోడ్పడాలి

ప్రజాశక్తి - కావలి

ప్రజలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు వైపున ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ప్రజలగొంతుకగా పనిచేసే పిడిఎఫ్ అభ్యర్థులను ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలిపించుకోవాలని పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. తూర్పు రాయలసీమ (నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం) నియోజక వర్గంలో పోటీ చేస్తున్న పట్టభద్రుల అభ్యర్థిగా మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయుల అభ్యర్థిగా పి.బాబురెడ్డిలను అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన కావలిలోని పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలలలోని పట్టభద్రులను కలిశారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో జరిగిన యుటిఎఫ్, జెవి.వి., ఉద్యోగ ఉపాధ్యాయులతో జరిగిన సమీక్షా సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల ఉద్యోగులు, నిరుద్యోగులు, పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో అయితే ఇప్పటికే విద్య, వైద్య వ్యవస్థలు నిర్వీర్యమైపోయాయన్నారు.



మాట్లాడుతున్న పిడిఎఫ్ పట్టభద్రుల అభ్యర్థి వెంకటేశ్వరరెడ్డి

ఎన్నికల సమయంలో ఉద్యోగులకు జగనన్న ఇచ్చిన ఏ ఒక్కహామీని కూడా ఇప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పిఆర్‌సితో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. నెలరోజుల్లో రద్దు చేస్తామన్న సిపిఎస్‌ను రద్దు చేయకపోగా, మోసపూరిత మైన జిపిఎస్‌ను తెరపైకి తెచ్చారన్నారు. వీటితోపాటు ఉద్యోగులు దాచుకున్న పి.ఎఫ్., ఎపిజిఎల్ఐసి డబ్బులను కూడా వాడుకుంటూ, అడిగినా ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. 30వేల మందికి ప్రమోషన్లు వస్తాయని ప్రభుత్వ పెద్దలు చెప్పారని, కానీ ఇప్పటికీ 3వేలమందికి కూడా ప్రమోషన్లు రాలేదని తెలిపారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను కూడా ఇప్పటికీ ప్రభుత్వం నెరవేర్చలేద న్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం పిడిఎఫ్ ఎంఎల్‌సిలు నిత్యం శాసనమండలి లో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ పోరాడుతున్నార న్నారు. ఈ కారణం చేతనే పిడిఎఫ్ అభ్యర్థుల ను ఓడించేందుకు అధికారపార్టీ (వైసిపి)తో సహా రాజకీయపార్టీల అభ్యర్థులు పోటీ చేస్తున్నారని, ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ, పెన్షనర్లు ఈ పరిణామాలను గుర్తించి, ఎంతో జాగ్రత్తగా పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సందర్భంగా అక్రమాలు జరగకుండా మేధావి వర్గం అప్రమత్తంగా వ్యవహరించా లని ఆయన హెచ్చరించారు. సమావేశానికి యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బి.శ్రీదేవి అధ్యక్షత వహించగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కిలారి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి పి.మాధవ, సిఐటియు నాయకులు పి.పెంచలయ్య, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరు మాల్యాద్రి, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, జి.మాల్యాద్రి, జెవివి జిల్లా కార్యదర్శి జానకి రామ్‌లు ప్రసంగించారు.యుటిఎఫ్ బోగోలు మండల అధ్యక్షులు బి.మాధవరావు, జలదంకి జి.రాజేంద్ర ప్రసాద్, కావలి రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు జి.వేణుగోపాల్, ఎస్‌కె.ముజీబ్, గుడ్లూరు, లింగసముద్రం మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, ప్రాంతీయ మండలాల యుటిఎఫ్ కార్య కర్తలు, కావలి డివైఎఫ్ఐ కార్యదర్శి పి.పెంచలనరసింహం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెళ్లేరు దళితులకు సిపిఎం మద్దతు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



ఆత్మకూరు బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట పెళ్లేరు దళితులకు భూముల వ్యవహారంలో అన్యాయం జరిగిందని శనివారం వారికి న్యాయం చేయాలని సిపిఎం, రైతు సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 19 రోజులుగా వర్షాన్ని కూడా లెక్కచేయకుండా నిరాహార దీక్ష చేపడుతున్నా అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదా అని ప్రశ్నించారు. పేదలకు ఒక న్యాయం.. భూస్వాములకు ఒక న్యాయమా.. అని ప్రశ్నించారు. పేదలకు న్యాయం జరిగే వరకూ దీక్ష కొనసాగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, జిల్లా కౌలు రైతు సంఘం నాయకులు మూలి వెంగయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి లక్కు ప్రసాద్, సిపిఎం ఆత్మకూరు పట్టణ కార్యదర్శి కొప్పోలు డేవిడ్ రాజు, బిఎస్‌పి నేతలు నంద ఓబులేసు, కృష్ణయ్య పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



మండలంలోని మహిమలూరు గ్రామంలో చెన్నయ్ శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలియజేశారు. దేశ రక్షణశాఖ సలహాదారుడు సతీష్‌రెడ్డి సూచనల మేరకు ఆయన మిత్రబందం శనివారం మహిమలూరులో జరిగే ఐ క్యాంపును పరిశీలించి వారికి సహాయంగా నిలిచారు. ఈ సందర్భంగా ఐ క్యాంపుకు డొనేషన్ అందజేసిన రామకృష్ణ, భానులు అమెరికా నుండి వచ్చి ఐ క్యాంపులో స్వయంగా పరిశీలించారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కుడుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ దేశ రక్షణ శాఖ సలహాదారుడు గుండ్రా సతీష్ రెడ్డి మహిమలూరులో పుట్టడం ఆ గ్రామానికి రాష్ట్రానికి గర్వకారణ మన్నారు. ఆయన సైంటిఫిక్ రంగంలో డిఆర్‌డిఒ రక్షణ శాఖలో వారు ఎదిగిన స్థానం వారికి దేశానికి చేసిన సేవలను వివరించారు. సతీష్‌రెడ్డి నంగునూరు గ్రామాన్ని దత్తత తీసుకొని ఈ గ్రామంలో కావాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను వారు స్వయంగా పర్యవేక్షిస్తూ చేపడుతున్నారని తెలిపారు. అందులో భాగంగా వారు బ్రాండ్ అంబాసిడర్ గా ఉన్న శంకర్ నేత్రాలయం వారి ఆధ్వర్యంలో ఈ ఐ క్యాంప్ కూడా నిర్వహిస్తున్నా రన్నారు. కార్యక్రమంలో సతీష్‌రెడ్డి మిత్ర బృందం, ఉడుముల సుధాకర్ రెడ్డి తోపాటు కరటంపాటి సుధాకర్, నలశెట్టి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఏలూరు రాజగోపాల్ రెడ్డి, బాబురావు, సంతోష్ స్వామి పాల్గొన్నారు.

ప్రయివేట్ స్కూల్స్ తీరు మారాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని ప్రయివేట్ స్కూల్స్‌లో ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులపై దాడులు తీవ్రమయ్యాయని వారిపై యాజమాన్యాల తీరు మారాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జి.సుధీర్ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవీంద్ర భారతి స్కూల్‌లో కన్నుకు గాయమయ్యేలా విద్యార్థిని కొట్టడం, కొత్తూరు ఓవెల్ స్కూల్‌లో మైనర్ విద్యార్థినిపై పిఆర్‌ఒ వేధింపులకు గురి చేయడం ఇలా పేద విద్యార్థులపై ఆగడాలు మితిమీరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రవీంద్ర భారతి, ఒవెల్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని కెవిపిఎస్ తరపున జిల్లా విద్యాశాఖను డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా, రెగ్యులర్‌గా పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు రూపొందించాలని తెలియజేశారు. తద్వారా విద్యార్థులపై ప్రయివేట్ స్కూల్స్ తీరు మారుతుందన్నారు. విద్యార్థులకు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరుతున్నామన్నారు.

రెండోరోజూ కార్తీకమాస లక్ష దీపోత్సవం

ప్రజాశక్తి-నెల్లూరు



వి.పి.ఆర్ ఫౌండేషన్ - కార్తీక మాస లక్ష దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరు వి.ఆర్.సి గ్రౌండ్‌లో జరుగుతున్న కార్తీక మాస లక్ష దీపోత్సవం శనివారం రెండోరోజూ కొనసాగింది. ఉదయం 9:00 గంటలకు 108 మంది దంపతులతో శ్రీ మహా విష్ణువుకి లక్ష తులసి పూజ నిర్వహించారు. 10 గంటలకు విశేష రుద్రహోమం చేపట్టారు. సాయంత్రం 5 - 6:30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 6:15 గంటలకు మధుర భారతి ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారితో లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. రాత్రి : 7 - 8:00 గంటల వరకు మధుర భారతి ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ గారితో కార్తీకదీప వైభవం - ప్రవచనం చేశారు. రాత్రి 8:00 గంటలకు మహావిష్ణువుకి 1008 కమలాలతో సహస్రనామార్చన, మహాశివునికి అభిషేకం, విశేష హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, సిటీ ఎంఎల్‌ఎ అనిల్ కుమార్ యాదవ్, స్థానిక సలహా కమిటీ, ఎస్ వి దేవస్థానం, ఉత్తర భారతదేశ తిరుమల తిరుపతి దేవస్థానాల న్యూ ఢిల్లీ అధ్యక్షులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నగర ప్రముఖులు, కార్పొరేటర్లు, లక్ష దీపోత్సవ కమిటీ సభ్యులు కంజర్ల భాస్కర శర్మ, మద్దిన విశ్వనాథ్, ఆమంచర్ల వెంకట ప్రభాకర్ శర్మ, సునీల్ కుమార్, విజయసారధి, తిరుపాల్‌రెడ్డి, పవన్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

ప్రజాశక్తి - ఆత్మకూరు అర్బన్



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ విక్రమ్‌రెడ్డి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల సంక్షేమం కోసం అందచేస్తున్న సంక్షేమ పథకాలన్ని అర్హులంద రికీ అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మార్కాపురం మున్సిపల్ పరిధిలోని 6, 10, 11 వార్డులకు సంబంధించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన సమస్యలపై పట్టణంలోని త్రికోటేశ్వర కళ్యాణ మండపంలో అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 6, 10, 11 వార్డుల శాఖల వారీగా వచ్చిన సమస్యలపై లబ్ధిదారులను పిలిపించి అధికారుల సమక్షంలో ఎంత కాల వ్యవధిలో పరిష్కారమవుతాయో తెలపాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవా లని, ప్రతి రెండు నెలలకోసారి రివ్యూ సమావేశాలు నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పదో వార్డు జమ్మలపాలెంకు చెందిన గిరిజనులు తమ పిల్లలకు ఆధార్ కార్డులు కావాలని ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకురావడంతో వెంటనే వారి సమస్య పరిష్కరించా లని తహశీల్దారును ఆదేశించారు. 11వ వార్డులో రేషన్ డీలర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అతనిపై ఎంఎల్‌ఎ మేకపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్‌డియు ఆపరేటర్లతో సయోధ్యగా రేషన్ సరుకుల పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వం సచివాలయాలకు అభివృద్ధి పనుల కోసం రూ.20 లక్షలు వంతున మంజూరు చేసిందని పనుల ప్రాధాన్యత గుర్తించి నివేదికలు ఇస్తే ఆ మేరకు పనులు మొదలు పెట్టనున్నట్లు ఎంఎల్‌ఎ తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్లు డాక్టర్ శ్రావణ్ కుమార్, షేక్ సర్దార్, ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనందరెడ్డి, కౌన్సిలర్లు నోటి విజయజ్యోతి, గుడి సంధ్యా, నాయకులు ఇందూరు వెంకటరమణారెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, కొండ వెంకటేశ్వర్లు, సయ్యద్ జమీర్, కౌన్సిలర్ మహబూబ్ బాషా, తోకల వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-కావలి: కావలి జవహర్‌భారతి డిగ్రీ కళాశాలలో విక్రమసింహపురి యూనివర్శిటీ అంతర్ కళాశాలల పోటీలను యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎం.సుందరవల్లీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జవహర్‌భారతిలో ఉన్న వసతులు ఎంతో ముందుచూపుతో, స్వలాభాపేక్ష లేకుండా కేవలం విద్యార్థుల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేయడం ముదావహమన్నారు. ఇంతటి సౌకర్యాలు గల కళాశాల యూనివర్శిటీలో ఉండడం సంతోషకరమన్నారు. ఈ సంస్థకు వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ అఛీవ్‌మెంట్ ఆవార్డు రావడం తమకు వచ్చినట్లుగా భావిస్తున్నామన్నారు. క్రీడలు, పరీక్షల వాల్యుయేషన్ తదితర యూనివర్శిటీ కార్యకలాపాలలో కూడా ఈ కళాశాల అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. శుక్ర, శనివారాల్లో జరిగిన వివిధ పోటీల్లో యూనివర్శిటీ పరిధిలోని 20 కళాశాలల టీములు పాల్గొన్నాయి. పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వి.సుధాకరరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.సుబ్రహ్మణ్యం నాయుడులను అభినందించి, విజేతలకు బహుమతులు అందజేశారు. పి.నారాయణరాజు ఇక్కడి ఏర్పాట్లను పరిశీలించి, పి.డి. ప్రసాద్‌రెడ్డిని అభినందించారు.

నేడు వ్యాపారస్తుల ఆత్మీయసమావేశం

ప్రజాశక్తి - కావలి

"నేషనల్ ఎంటర్‌పెన్యూర్స్‌డే" సందర్భంగా కావలి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో స్థానిక ది కట్‌పీసెస్ క్లాత్‌మర్చంట్స్ అసోసియేషన్ కళ్యాణ మండపం (సబ్‌కోర్టువీధి)లో ఆదివారం ఉదయం యువ వ్యవస్థాపకుల ఆత్మీయ సమావేశం జరుగుతుందని కార్యక్రమ సమర్పకులు శ్రీబాలాజి -చవేరా (కావలి-గుంటూరు) నిర్వాహకులు చన్నా వెంకట్రామయ్య ప్రకటనలో తెలియజేశారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా తిరుపతి శ్రీవెంకటేశ్వర యూనివర్శిటీ, యూ.కె.కామన్‌వెల్త్ విజిటింగ్ ఫెలో ప్రొఫెసర్ హిమాచలం దాసరాజు పాల్గొని "యువ ఔత్సాహికులు-దేశాభివృద్ధికి పెన్నిధులు" అనే అంశంపై ఉపన్యసిస్తారని, వ్యాపారాభివృద్ధికి తగిన సూచనలు తెలియజేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, కార్యదర్శులు నేరెళ్ల జ్వాలారావు, బచ్చు వీరాస్వామి, చన్నా వెంకట్రామయ్యలు వ్యాపార రంగంలో వారి అనుభవాలను తెలియజేస్తారని వివరించారు. కనుక వివిధ రంగాలలోని ఉత్సాహ వంతులైన యువ ఔత్సాహికులను వారు సాదరంగా ఆహ్వానించారు. మధ్యాహ్నం 12 గంటలకు విందు కూడా ఏర్పాటు చేస్తున్నామని సంబంధితులు సకాలంలో విచ్చేసి, ఈ సామాజిక సేవా కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరారు.

1219 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-కావలి

కావలి కోర్టు భవనాల ఆవరణంలో కావలి మండల న్యాయ సేవా అధికారిక సంస్థ ఆధ్వర్యంలో శనివారం జరిగిన జాతీయమెగా లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు12, క్రిమినల్ కేసులు1165, బ్యాంకు రికవరీ కేసులు 42 మొత్తం1219 కేసులు పరిష్కారమయ్యాయని సీనియర్ సివిల్ జడ్జీ ఎం.శోభా తెలియజేశారు. దీనికి గానూ రూ.1,15,95,100 రికవరీ అయిందన్నారు. జాతీయ మెగా లోక్‌అదాలత్ బాగా నిర్వహించినం దుకు న్యాయమూర్తులను, న్యాయవాదులను, పోలీస్ వారిని కోర్టు సిబ్బందిని అభినందించారు. బెంచికి అదనపు జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ అన్నపూర్ణ శ్రీ, బెంచి మెంబర్లుగా ఎస్.ఎక్స్.కెనడీ, శ్రీదేవి, మనోరమ, మాచర్ల (సోషల్,వర్కర్), కార్యక్రమానికి సురేంద్రరెడ్డి (ప్రెసిడెంటు, బార్ అసోసియేషన్), న్యాయవాదులు హజరయ్యారు.

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-బిట్రగుంట



బోగోలు మండలం కోవూరుపల్లి గిరిజన కాలనీ నిరుపేద వృద్ధుల కు, వితంతువులు, వికలాంగులకు కాండ్ర సతీష్ నాయుడు దాతృత్వంతో వర్షాకాలంలో చలికి ఇబ్బంది పడుతున్న వారికి శనివారం దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో గిరిజన జాగృతి వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాపట్ల.వెంకటపతి, దళిత ఆల్ ఇండియా మిషన్ కావలి డివిజన్ కన్వీనర్, కట్టేపల్లి.సింహాద్రిరావు పాల్గొని మాట్లాడారు. సమాజంలో కోట్లు గడించిన వారు ఉన్నప్పటికీ పేద, బడుగు, బలహీన వర్గాల వారికి సహాయం చేయాలన్న దృక్పథం కొందరికే ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీట్ల.ప్రత్యూష్, రాష్ట్ర గిరిజన నేత జేయంపు. కనకయ్య, రవి, ఎహెసుగేలు, ఫ్రాంక్లిన్, అంగన్‌వాడీ కార్యకర్త అనూష, గిరిజన నాయకులు వై.శ్రీనివాసులు, పి.కృష్ణయ్య, తదితరులున్నారు.

జగనన్న ఇళ్లు.. పేదలకు కన్నీళ్లు..

ప్రజాశక్తి-ఉదయగిరి

ముఖ్యమంత్రి చేపట్టిన జగనన్న ఇళ్లు పేదలందరికీ చేత కన్నీరు తెస్తున్నాయని జనసేన జిల్లా కార్యదర్శి అల్లూరి రవీంద్ర వెల్లడించారు. ఆదివారం కొండాయపాలెం పంచాయతీలోని జగనన్న ప్లాట్లు వద్ద జాతీయ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ పిలుపుమేరకు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12,13,14 తేదీలలో జరుగుతున్న జగనన్న ఇళ్లు పేదలందరికీ కన్నీళ్లు కార్యక్రమంతో నిరసన తెలుపుతున్నా మన్నారు. కార్యక్రమంలో కిరణ్, జనసైనికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : 'జగనన్న ఇళ్లు-పేదలందరికీ కన్నీళ్లు' జనసేన సామాజిక పరిశీలన కార్యక్రమంలో భాగంగా జగనన్న మోసం అనే హ్యాష్ ట్యాగ్‌తో శనివారం జనసేన నాయకులు, కార్యకర్తలు మద్దురుపాడులోని టిడ్కోఇళ్లను, అదేవిధంగా ముసునూరు దగ్గరి జగనన్న కాలనీల దగ్గర నిరసనను చేపట్టారు. ఈ సందర్భంగా కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్, సమ్మను వెంకట సుబ్బయ్య, రిషికేష్‌లు మాట్లాడుతూ టిడ్కో ఇళ్లు పేదప్రజల అపార్ట్‌మెంట్ కలను వైసిపి ప్రభుత్వం నీరుగార్చి, జగనన్న మోసం చేశాడని దుయ్య బట్టారు. టౌన్ ప్రసిడెంట్ పాబ్బ సాయి, కో ఆర్డినేటర్ సుధీర్, వైస్ ప్రెసిడెంట్ నాగార్జున, రూరల్ అధ్యక్షుడు వెంకయ్య, బోగోలు అధ్యక్షుడు నూరుద్దీన్, ప్రవీణ్, అల్లూరు మండల అధ్యక్షుడు కార్తీక్ శర్మ, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, ప్రవీణ్, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్ఆర్' విద్యార్థులు విజయకేతనం



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : విక్రమ సింహపురి యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో ఎస్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు బికాం కంప్యూటర్, బిఎస్‌సి (ఎంఎస్‌సిఎస్) విభాగాలలో యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంకును సాధించారు. బీకాం కంప్యూటర్స్ విభాగంలో టీ.దొరసాని 350 మార్కులకు గానూ 347 మార్కుల సాధించి యూనివర్సిటీ ప్రథమ ర్యాంక్‌ను సాధించింది. బి.ఎస్‌సి (ఎంఎస్‌సిఎస్) విభాగంలో టీ రషీదా, పి.సిమా ఫర్జానాలు 400 మార్కులకు గానూ 398 మార్కులు సాధించి యూనివర్సిటీ ఫస్ట్ నిలిచారు. బిఎ విభాగంలో ఆర్.కావేరి లక్ష్మి, 300 మార్కులకు గానూ 250 మార్కులు సాధించి డివిజన్ ఫస్ట్‌గా నిలిచారని కళాశాల కరస్పాండెంట్ ఎం.సుబ్బారెడ్డి తెలిపారు.

వృద్ధుడి శవానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-కావలి : సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో బుడంగుంట ఇందిరమ్మ కాలనీలో శనివారం వెంకయ్య (70) చనిపోవడంతో సంయుక్త సేవాసంస్థ సభ్యుల సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ బుడంగుంట ఇందిరమ్మ కాలనీలో వెంకయ్య అనే వృద్ధుడు చనిపోయారని అంత్యక్రియలకు సహాయం చేయమని ఆ ఏరియా ప్రజలు సంయుక్త సేవా సంస్థను ఆశ్రయించినట్లు తెలిపారు. వెంకయ్య గురించి తమసభ్యులకు తెలియజేసిన వెంటనే స్పందించి సాయం అందజేశారన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యపోటీలు

ప్రజాశక్తి-కావలి : డాక్టర్ డి.ఆర్. విశ్వోదయ బాలల దినోత్సవం సందర్భంగా డాక్టర్ రామ్ సెంటర్ ఆధ్వర్యంలో జవహర్ భారతి ఎంఎం హాలులో ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు మూడోరోజూ శనివారం శాస్త్రీయ నృత్య పోటీలు, జానపద నృత్య పోటీలు ఉల్లాసంగా నిర్వహించారు. పోటీలలో విద్యార్థులు వివిధ పాఠశాలల నుండి పాల్గొని తమ ప్రతిభ చాటారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్ రెడ్డి, రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, ఆర్గనైజర్ జ్యోతిశ్రీ పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత కాటంరెడ్డి

ప్రజాశక్తి-కావలి : జిల్లాలో రక్తదాన ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాత కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి వక్తలు పేర్కొన్నారు. శనివారం రెడ్‌క్రాస్ రక్తకేంద్రంలో కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు గంధం ప్రసన్నాంజనేయులు, సాయి కోఆపరేటివ్ జూనియర్ కళాశాల కరెస్పాండెంట్ గోసల గోపాలరెడ్డి, పూనూరు మురళీధర్ రెడ్డి, పద్మనాభరెడ్డి, ఆల్తుర్తి సతీష్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి ఎంఎల్ఎ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-కలిగిరి : మండలంలోని పోలంపాడు గ్రామ సచివాలయం పరిధిలోని రావులకొల్లు, ఏపినాపి, వీరారెడ్డిపాలెం గ్రామాలలో ఆదివారం జరగనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైసిపి కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఉదయగిరి శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గం ప్రచార కార్యదర్శి శాంతి కుమారిలు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని తెలియజేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు గ్రామ సచివాలయాల ఉద్యోగులు, వాలంటీర్లు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు పాల్గొని గడప గడపకు మన ప్రభుత్వం లక్ష్యాలను ప్రజలకు సంపూర్ణంగా వివరించే దిశగా కృషి చేయాలని కాటం రవీంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు.

300 రోజులు దాటిన జెన్కో పోరాటం

ప్రజాశక్తి-నెల్లూరు : శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ ప్రాజెక్టును లీజు పేరుతో ప్రయివేటీకరణ చేసేందుకు రాష్ట్ర కేబినెట్ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యోగులు, స్థానిక ప్రజలు, కార్మికులు చేస్తున్న పోరాటానికి 300 రోజులు పూర్తయ్యాయి. ఇంతటి పోరాటం జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్లయినా లేదు. జిల్లాలోని సివిల్ సప్లయి విభాగంలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలు విచారణ సిబిఐ అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందుకున్న వెంటనే సిబిఐ తన విచారణ వేగవంతం చేసింది. ఇందులో భాగంగా నిందితులను సంబంధించి ఇళ్లపై, వారి రక్తసంబంధీకుల ఇళ్లపై జిల్లాలో ఏకకాలంలో 8 చోట్ల దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అనేక విలువైన పత్రాలను, నగదును స్వాధీనం చేసుకున్నారు. అంతే కాకుండా 2014లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా 10 సంవత్సరాలు ఇస్తామని, రాష్ట్ర రాజధాని అమరావతిలో భవన నిర్మాణ పనులకు ఆర్థికసాయం చేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 8 సంవత్సరాలు పూర్తయినా వాటిని విస్మరించి రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్రమోడీ గో బ్యాక్ అంటూ వామపక్ష పార్టీలు నిరసన కార్యక్రమం చేపట్టాయి. రాష్ట్రంలో ప్రధాని పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్షాలు నిరసన కార్యక్రమాలు చేపడుతుంటే, వారిని అణిచివేసేందుకు వామపక్ష నాయకులను గృహ నిర్బంధం, అరెస్టులు చేయడం దారుణమంటూ ఆందోళనలు చేశాయి.

వీక్షణం